# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 165 | విశాఖపట్నం | 17-3-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 165 | VISAKHAPATNAM | 17-3-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.


అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902

5లో

## పాతపట్నంలో అధ్వానంగా సాగునీటి కాలువలు!



2లో

## ఎయిరిండియా కీలక నిర్ణయం.. దుబాయ్ వెళ్లే విమానాల రద్దు



6లో

## మహిళల్లో అధికంగా వచ్చే వ్యాధులు..!

# పొట్టి శ్రీరాములు త్యాగాన్ని తెలుగుజాతి గుర్తుంచుకోవాలి: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఒక చరిత్ర అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. పొట్టి శ్రీరాములు అందరివాడని భావించి.. ప్రతి ఒక్కరూ ఈ విగ్రహావిష్కరణ కోసం కృషి చేశారన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తయితే ఈ విగ్రహం మరింత అద్భుతంగా కనిపిస్తుందన్నారు. రాజధానిలోని శాఖమూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం చేశామని చెప్పారు. అహింసా మార్గంలో ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాముల త్యాగం ఈ తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. స్ఫూర్తికి మారు పేరు ఆర్యవైశ్య సంఘమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు పనిచేశారని తెలిపారు. అలాగే అనేక సామాజిక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధించి పెట్టారని చెప్పారు. ఇక రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతోమంది రైతుల త్యాగం ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారీ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించారని వివరించారు. రాజధాని లేని రాష్ట్రంలో



వైసీపీ.. మూడు ముక్కలాట ఆడిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని గత పాలకులు స్మశానం అని అవహేళన చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని వివరించారు. రెండో దశ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ వినియోగించారని సీఎం చంద్రబాబు చెప్పారు. గత ప్రభుత్వం పాలనతో బ్రాండ్ దెబ్బతిన్నదని.. తెలుగు జాతి ఇబ్బంది పడిందని గుర్తించి తాను, పవన్ కళ్యాణ్ ఇద్దరం కలసి నిలబడి.. బీజేపీతో కలిసి కూటమిగా జత కట్టామని వివరించారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు.

2027 గోదావరి పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అమరావతిని మూడు ఏళ్లలో ఒక స్థాయికి తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో ఖర్చు ప్రభుత్వం డబ్బు కాదని.. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని ఏపీ సీఎం వివరించారు. అమరావతి వల్ల సంక్షేమం సక్రమంగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములకు నిజమైన నివాళి ఇవ్వడమంటే.. ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమేనని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



4లో

# అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోండి: పెద్దిరెడ్డి

- దుర్మార్గపు పాలన కొనసాగుతుంది..
- వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారు..
- వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇలాంటి చర్యలే పునరావృత్తం
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి

# పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేద్దాం: అనిత



**నక్కపల్లి, పతాకం న్యూస్:** నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో హోం మంత్రి వంగలపూడి అనిత(ఎశీఎవ వీఱఅఱర్‌వతీ ఖుఅస్త్రుశ్రీఖుజాబఒఱ ాాఅఱష్త్రు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు హోం మంత్రి. అనంతరం అనిత మాట్లాడుతూ.. మహానుభావుడు, త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తి యావత్ తెలుగు జాతికి ఆదర్శమని తెలిపారు. 58 రోజుల కఠోర ఉపవాస దీక్ష అనంతరం పొట్టి శ్రీరాములు తుది శ్వాస విడిచారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలిన మహానీయుడు పొట్టి శ్రీరాములు అని హోంమంత్రి కొనియాడారు. పొట్టి శ్రీరాములు త్యాగానికి ప్రతీకగా ప్రజా రాజధాని అమరావతిలో అమరజీవి 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని హోంమంత్రి అనిత పిలుపునిచ్చారు.



## శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం


4లో

## రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అమరావతి నిర్మాణం: నారాయణ



2లో

## పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైసీపీ విమర్శలు దుర్మార్గం: మంత్రి నిమ్మల ఫైర్



2లో


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## నష్టపోతున్న రైతులు

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం మన రాష్ట్ర రైతులను తీవ్రంగా దెబ్బ తీస్తున్నది. హార్మోజ్ జలసంధి మూసివేయడం, రవాణా విమానాలు రద్దు కావడంతో మన రాష్ట్రం నుండి ఇరాన్, గల్ఫ్ దేశాలకు ఎగుమతులు ఆగిపోయాయి. అరటి, మామిడి, కొబ్బరి, రొయ్యలు, కోడిగుడ్ల ఉత్పత్తిదారులు పెద్దఎత్తున నష్టపోతున్నారు. దేశంలో మన రాష్ట్రం నుండి ఎక్కువగా పండ్లు, ఇతర ఉత్పత్తులు ఇరాన్‌కు ఎగుమతి అవుతున్నాయి. మన రాష్ట్ర ఉద్యాన పంటల ఉత్పత్తులకు ఇరాన్, కువైట్, ఒమన్, సౌదీ అరేబియా, ఇరాక్ దేశాలు పెద్ద మార్కెట్‌గా వున్నాయి. అందునా రంజాన్ మాసంలో మంచి డిమాండ్ వుంటుంది. సరిగ్గా ఈ సమయంలోనే ఫిబ్రవరి 28న అకస్మాత్తుగా అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ దాడులు ప్రారంభమై రెండు వారాలు పూర్తయింది. ఇరాన్ అధినేతను హత్యగావించడం ద్వారా ఆ దేశాన్ని తమ అదుపులోకి తీసుకోవచ్చని ట్రంప్, నెతన్యాహు భావించారు. అందుకు భిన్నంగా ఇరాన్ ఊహించని ప్రతిఘటనతో అమెరికా, ఇజ్రాయిల్‌కు చుక్కలు చూపిస్తున్నది. ఈ యుద్ధం ఇప్పట్లో ముగిసే పరిస్థితి కనిపించడంలేదు. చేతికి వచ్చిన పంటల ఎగుమతులు నిలిచిపోవడంతో గిట్టుబాటు ధరలు లేక రైతులు విలవిలలాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టడం లేదు. అనేక దశాబ్దాలుగా మన దేశం అనుసరించిన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కేంద్ర బిజెపి పాలకులు అమెరికా అనుకూల విధానంగా మార్చడంతో పొరుగు దేశాలతో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రపంచంలో ఒంటరైపోవడం దేశ పాలకుల స్వయంకృతాపరాధం. ఇరాన్ యుద్ధం పట్ల స్పష్టమైన విధానం తీసుకోలేని నిస్సహాయస్థితిలో కేంద్ర ప్రభుత్వం వున్నది. 'వదలమంటే పాముకు కోపం-మింగమంటే కప్పకు కోపం' అన్నట్లుగా మన దేశీయ విధానం అటు ఇటూ కాకుండా పోయింది. గల్ఫ్ దేశాలకు మన రాష్ట్రం నుండి ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులు ఆగిపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో సాగవుతున్న అరటి, మామిడి, చీనీ ఉత్పత్తుల ఎగుమతులు ఆగిపోయాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 21 మండలాల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. దాదాపు 89,000 మంది రైతులు ఈ పంటపై ఆధారపడి వున్నారు. ఇక్కడ పండే తోతాపురి, బేనీషా, ఆల్ఫోన్సో రకాలు గల్ఫ్ మార్కెట్‌కు ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. మామిడి తొలి పంట చేతికి రావాలంటే కనీసం నాలుగు సంవత్సరాలు సాగు చేయాల్సిందే. తెగుళ్ళతో పాటు, అకాల గాలివానలు ఎప్పుడైనా ఈ రైతులను దెబ్బ తీయవచ్చు. ఇన్ని కష్టాల మధ్య సాగు చేసిన మామిడి రైతులను ఇరాన్ యుద్ధం ఊహించని రీతిలో దెబ్బతీసింది. సగటున ప్రతి సంవత్సరం 5.5 నుండి 6.5 లక్షల టన్నుల మామిడి, మామిడి పల్ప్ ఇరాన్, సౌదీ అరేబియా, కువైట్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. యుద్ధం వల్ల ఎగుమతులు లేవని గత నెలలో వున్న ధరలో సగం ధరకు కూడా కొనేవారు లేక రైతులు అల్లాడిపోతున్నారు. క్రిష్ణా జిల్లాలో నూజివీడు మామిడికి కూడా గల్ఫ్ దేశాల్లో మంచి డిమాండ్ వుంది. ఎక్కువ భాగం మార్చి-ఏప్రిల్ నెలల్లో ఎగుమతులకు సిద్ధంగా వున్న పంటను ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో రైతులు వున్నారు. అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సుమారు లక్ష హెక్టార్లలో అరటి సాగవుతుంది. ఈ అరటికి అరబ్ దేశాల్లో మంచి డిమాండ్ వుంటుంది. ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల అరటి ఎగుమతి అవుతుంది. మార్చి-ఏప్రిల్ నెలల్లో కువైట్, ఇరాన్, ఇరాక్, యునైటెడ్ అరబ్ దేశాలకు ఎగుమతి అవుతుంది. టన్ను రూ.14,000 నుండి రూ.25,000 వరకు వున్న ధర ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల ఆరు నుండి ఎనిమిది వేలకు పడిపోయింది. ఒక ఎకర సాగుకు సుమారు రూ.80 వేల నుండి లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుంది. గల్ఫ్ దేశాలకు బయలుదేరిన 3 పడవలు మార్గ మధ్యం నుండి వెనక్కి పంపడంతో వ్యాపారులు ముందుకు రావడంలేదు. ధర పడిపోవడంతో అరటి రైతులకు ప్రతిరోజు సగటున రెండున్నర కోట్ల నష్టం జరుగుతున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. రంజాన్ మాసంలో ఎక్కువ డిమాండ్ వున్న చీనీ ఎగుమతులు పూర్తిగా ఆగిపోయాయి. ఈ పంటల ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారులు రైతుల వైపు చూడడంలేదు. లక్షల పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఆందోళనలో వున్నారు. గత కరోనా సమయంలో వచ్చిన దుర్భర పరిస్థితి నుండి కోలుకుంటున్న ఉద్యాన పంటల రైతులను ఇరాన్ యుద్ధం మరోసారి పెద్ద దెబ్బ తీసింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వాలు మాటలతో కాలక్షేపం చేస్తున్నాయి. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎక్కువగా ఉత్పత్తి అవుతున్న కోడిగుడ్లలో ప్రతి రోజు సుమారు 70 లక్షల గుడ్లు గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. యుద్ధ ప్రభావంతో ఎగుమతులు ఆగిపోయాయి. గుడ్డు ధర నాలుగు రూపాయలకు పడిపోయింది. కిలో చికెన్ కొంటే మూడు, నాలుగు కోడిగుడ్లు ఫ్రీ అని తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో చికెన్ షాపుల ముందు బోర్డులు పెడుతున్నారు.

## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా
### 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్




**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తానని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజారాజధాని అమరావతిలో తన హామీకి ప్రతిరూపంగా నిలిచిన 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణ తనకెంతో ఆనందాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన సాగించిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతీకగా 58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని అమరావతిలోని శాఖమూరులో ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరిగిన ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి త్యాగశిల్పం వద్ద ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచింది. ఒక దీక్ష ఒక రాష్ట్రాన్ని ఇచ్చింది. పొట్టి శ్రీరాములు గారు మరణం లేని మహనీయుడు, త్యాగానికి మానవరూపం. ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఈ విగ్రహానికి ఏం పేరు పెట్టాలని డూండి రాకేష్ అడిగినప్పుడు, ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' అని సూచించాను. ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది" అని వివరించారు. తాను తెలుగువాడినని, ఆంధ్రప్రదేశ్ పౌరుడినని గర్వంగా చెప్పుకుంటున్నానని, ఆ గౌరవాన్ని మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు అని లోకేశ్ అన్నారు. "యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను అనేకసార్లు కలిసి వారి సమస్యలు చర్చించాను. వారికిచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని ఇంత తక్కువ సమయంలో నిలబెట్టుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ విగ్రహంలోని 58 అడుగులు, ఆయన చేసిన 58 రోజుల దీక్షకు సంకేతం. మనం ఒక్కరోజు ఉపవాసం ఉండటానికే ఇబ్బంది పడతాం. అలాంటిది ఒక రాష్ట్రం కోసం ఆయన 58 రోజులు దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఈ చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత" అని లోకేశ్ ఉద్ఘాటించారు. కేవలం 194 రోజుల్లోనే విగ్రహ ఏర్పాటు పూర్తి చేసిన కూటమి ప్రభుత్వాన్ని, ట్రస్ట్ సభ్యులను, అధికారులను ఆయన అభినందించారు.

## ప్రత్తిపాడులో 17 రోజులుగా పెద్దపులి సంచారం



**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 17 రోజులుగా పెద్దపులి సంచారం అక్కడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. పులిని పట్టుకునేందుకు అటవీశాఖ ప్రత్యేక బృందాల ప్రయత్నాలు కొనసాగుతున్నా ఇప్పటివరకు ఫలితం లేదు. శంఖవరం మండలం మండపం వద్ద పోలం బూరయ్య అనే రైతు గేదె దూడపై పులి దాడి చేసింది. ప్రస్తుతం శంఖవరం మండలం, జి.కొత్తపల్లి సమీపంలో పెద్దపులి, ప్రత్తిపాడు లేదా రౌతులపూడి మండలాల వైపు పులి ప్రయాణించే అవకాశముందని, మూడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

## రామాయపట్నం నుంచి కడపకు రైల్వే లైన్..
## కేంద్రం ఓకే చెప్పిందన్న సీఎం చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలకమైన ఈస్ట్-వెస్ట్ కార్గో కారిడార్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనుల పురోగతిపై సచివాలయంలో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులలో కార్గో కార్యకలాపాలను వీలైనంత త్వరగా ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఈ మూడు పోర్టుల ద్వారా పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి సరుకు రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని అధికారులు సీఎంకు వివరించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) రిఫైనరీ ఏర్పాటు తర్వాత రామాయపట్నం పోర్టు ఒక ప్రధాన కంటైనర్, బల్క్ కార్గో కేంద్రంగా మారుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. రామాయపట్నం నుంచి కడప స్టీల్ ప్లాంట్ వరకు ప్రత్యేక రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడించారు. పోర్టులకు సమీపంలో పోర్టు టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయడం ద్వారా వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయని, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కూడా అపార అవకాశాలు ఉన్నాయని సీఎం దిశానిర్దేశం చేశారు. రెండో దశలో చేపడుతున్న బుడిగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.

## ఎయిరిండియా కీలక నిర్ణయం..
## దుబాయ్ వెళ్లే విమానాల రద్దు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ ల మధ్య యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ ఎయిర్ పోర్టు సమీపంలో ఇంధన ట్యాంక్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఈ క్రమంలో విమానాశ్రయ పరిసర ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఎయిర్ పోర్టును మూసివేస్తున్నట్లు దుబాయ్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియాకీలక నిర్ణయం తీసుకుంది. దుబాయ్ వెళ్లే విమానాలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, అబుదాబి, రస్ అల్‌ఖైమా, షార్జాలకు విమానాలు యథావిధిగా కొనసాగుతాయని ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. 'దుబాయ్‌లో విమాన కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఇండియా నుంచి దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు వెళ్లే అన్ని విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేశాం. దుబాయ్‌కు బయలుదేరే ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు ఈరోజు రద్దయ్యాయి' అని ఎయిరిండియా సంస్థ ఎక్స్ రాసుకొచ్చింది. మరోవైపు తిరువనంతపురం నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ విమానం కూడా ఆగింది. TRV-DXB విమానం353 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బందితో ఇవాళ ఉదయం 4:40 గంటలకు బయలుదేరి.. దుబాయ్ ఎయిర్ పోర్టు మూసివేయడంతో ఉదయం 8:40 గంటలకు తిరిగి వచ్చింది. అలానే కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరిన మరో ఎమిరేట్స్ విమానం జుఖ533 కూడా వెనక్కి వచ్చేసింది.

## రైతులకు ఇచ్చిన మాట ప్రకారం
## అమరావతి నిర్మాణం: నారాయణ



**అమరావి, పతాకం న్యూస్:** రైతులకు ఇచ్చిన మాట ప్రకారమే రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో హెచ్‌ఓడీ (నూణ) టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం చోటు చేసుకుంది. టవర్ -1కు మొదటి స్టీల్ డయాగ్రిడ్‌ను అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రారంభించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతిలో జీఏడీ, హెచ్‌ఓడీలకు మొత్తం 5 టవర్లు డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మిస్తున్నామని తెలిపారు. జీఏడీ టవర్ మొత్తం 47 అంతస్తులతో మిగిలిన టవర్లు 40 అంతస్తులతో నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. మొత్తం 53 లక్షల చదరపు అడుగు బిల్డ్ ఏరియాతో ఈ ఐదు టవర్ల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా ఈ టవర్ల నిర్మాణం ప్లాన్ చేశామన్నారు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా ఒకే చోట అన్ని కార్యాలయాలు ఉండేలా డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు. 2028 అక్టోబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిందని తెలిపారు. ట్రంక్ రోడ్లు, లేఅవుట్ రోడ్లతోపాటు ప్రైవేట్ సంస్థల నిర్మాణాలు సైతం ప్రారంభమయ్యాయన్నారు. రాజధాని అమరావతిలో డయాగ్రిడ్ విధానంలో ఐదు ఐకానిక్ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

## పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైసీపీ
## విమర్శలు దుర్మార్గం: మంత్రి నిమ్మల ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతిలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు దుర్మార్గమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. భవిష్యత్ తరాలకు పొట్టిశ్రీరాములు త్యాగనిరతి స్ఫూర్తిగా నిలవాలనే లక్ష్యంతో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, ఇది ఎన్నికల హామీని నిలబెట్టుకోవడమేనని స్పష్టం చేశారు. దోపిడీ, లూటీలకు అలవాటుపడిన వైసీపీ నేతలకు త్యాగాల విలువ తెలియడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆర్యవైశ్యులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. ఎవరికీ సాయం చేయకూడదనే డీఎన్ఏ జగన్‌ది కాబట్టే, కన్నతల్లిని, చెల్లిని కూడా మోసం చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అడ్డగోలుగా అప్పు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని మంత్రి విమర్శించారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని తాము అధికారంలోకి వచ్చాక ఐసీయూలోకి తీసుకొచ్చామని అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రంలో సౌకర్యవంతమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారని నిమ్మల రామానాయుడు వివరించారు.

# కోటి సంతకాలతో మెడికల్ కళాశాలలు పీపీపీ విధానాన్ని అడ్డుకుందాం



**అమరావతి, పతాకం న్యూస్:** ఎలమంచిలి మునిసిపాలిటీ రెండవ పాలకవర్గం వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ రమాకుమారి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాలకవర్గ ప్రతినిధులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మునిసిపల్ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ఈ నెల 17వ తేదీతో ముగియనుండడంతో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకవర్గ సభ్యులతో పాటు కమిషనర్ ప్రసాదరాజు, అధికారులు చైర్‌పర్సన్ రమాకుమారిని ఘనంగా సత్కరించారు. అదే విధంగా కౌన్సిలర్లను అధికారులు సన్మానించారు. పాలకవర్గమంతా సమష్టిగా మునిసిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించారని చైర్‌పర్సన్ కొనియాడారు. మునిసిపల్ పాలకవర్గం వీడ్కోలు కార్యక్రమానికి ప్రత్యేక సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో విందుకు అవసరమైన వంటకాలన్నీ ప్రతి కౌన్సిలర్, అధికారులు తమ ఇంటి వద్ద తయారు చేయించి తీసుకువచ్చారు. ఇలా సుమారు 52 రకాలతో ఈ విందు ఏర్పాటు చేశారు. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు గిరిజన సంప్రదాయ వంటకాలు పులగం, అంబలి తయారు చేయించి తీసుకువచ్చారు. ఈ వంటకాలన్నీ రుచికరంగా ఉన్నాయని పాలకవర్గ ప్రతినిధులు, అధికారులు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులు గ్రూపు ఫోటోలు దిగారు.

## ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడుదాం

### మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షులు కాటపల్లి అప్పారావు పిలుపు



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధనకై ఐక్యంగా కలిసి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షులు కాటపల్లి అప్పారావు అన్నారు. మండల కేంద్రం దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద సోమవారం సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను 25 శాతంకు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో (సెక్షన్ 41) స్టేషన్ బెయిల్ రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన 28 రకాల ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తక్షణమే మంజూరు చేసి దళిత, గిరిజన వాడాలను అభివృద్ధి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజలంతా అంబేద్కర్ రాసిన రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మచ్చా రామారావు, ఉల్లి శ్రీను, కాటపల్లి సన్యాసిరావు, తెరపల్లి శ్రీరామ్, పల్లా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కార్మికులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసిన సీఐటీయూ




**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** మహిళా కార్మికులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవని విశాఖ జిల్లా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వి. కుమార్, శ్రామిక మహిళా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ పి. మణి తెలియజేశారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. . సుప్రీం కోర్టు ఇటీవల (మార్చి 13, 2026) ఒక పిటిషన్‌ను తీసిపారేసింది. ఆ పిటిషన్ దేశవ్యాప్తంగా మహిళలకు మెన్స్ట్రువల్ లీవ్ (పీరియడ్స్ సమయంలో జీతంతో సెలవు) ఇవ్వాలని, దానికి జాతీయ విధానం రూపొందించాలని కోరింది. సుప్రీం కోర్టు బెంచ్ (చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్య కాంత్, జస్టిస్ జోయమల్య బాగ్చి) ఇలా అన్నారు: మెన్స్ట్రువల్ లీవ్‌ను బలవంతంగా చట్టం చేస్తే, యజమానులు మహిళలను నియామకం చేయడానికి ఇబ్బంది పడతారు / ఇష్టపడరు. ఇది మహిళల కెరీర్ అవకాశాలను దెబ్బతీస్తుంది, వారికి పెద్ద బాధ్యతలు ఇవ్వరు, సమానత్వం దెబ్బతింటుంది. కాబట్టి, దీనిని బలవంతంగా చట్టం చేయలేము. కానీ, కేంద్ర ప్రభుత్వం స్టేక్‌హోల్డర్లతో చర్చించి విధానం రూపొందించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీఈ అభిప్రాయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది నియో-లిబరల్ (ప్రభుత్వం వ్యాపార సౌలభ్యానికి ప్రాధాన్యత ఇచ్చే) దృక్పథం అని, కార్మికులు-మహిళలకు వ్యతిరేకమన్నారు. మహిళల ఆరోగ్య సమస్యలను (మెన్స్ట్రువేషన్ సమయంలో నొప్పి, ఎండోమెట్రియోసిస్ వంటివి) దాచిపెట్టడం తప్పు. దేశంలో 36 కోట్ల మంది మహిళలు మెన్స్ట్రువేట్ అవుతున్నారు, 50-90% మందికి నొప్పి వస్తుంది. ఇది పబ్లిక్ హెల్త్ సమస్య, స్త్రీల హక్కులు (ఆర్టికల్ 21 కింద జీవన హక్కు, గౌరవం)కు సంబంధించినది.

యజమానుల వల్ల వివక్ష జరిగితే, ఆ వివక్షను అరికట్టాలి -- హక్కులను తగ్గించకూడదు. మెటర్నిటీ లీవ్, సమాన హక్కులు వంటివి ఇలాగే వచ్చాయి -- అవి కూడా యజమానులకు ఇబ్బంది కలిగించాయని చెప్పి తీసేయలేదు. కర్ణాటక, బిహార్, ఒడిశా, కేరళలో ఇప్పటికే మెన్స్ట్రువల్ లీవ్ ఉంది. జపాన్, ఇండోనేషియా, స్పెయిన్ వంటి దేశాల్లో కూడా ఉంది -- దీని వలన మంచి ఫలితాలు వచ్చాయి. **సీఐటీయూ డిమాండ్స్:** జాతీయ స్థాయిలో మెన్స్ట్రువల్ హెల్త్ & వర్క్‌ప్లేస్ రైట్స్పై సమగ్ర విధానం రూపొందించాలని సీఐటీయూ కోరుతుంది. రైట్ ఆఫ్ విమెన్ టు మెన్స్ట్రువల్ లీవ్ అండ్ ఫ్రీ యాక్సెస్ టు మెన్స్ట్రువల్ ప్రొడక్ట్స్ యాక్ట్ చట్టం చేయాలి (పని చేసే మహిళలు, విద్యార్థినులకు). మెన్స్ట్రువల్ లీవ్ అనేది అనుకంప కాదు -- సమానత్వం, మానవీయ పని పరిస్థితులు కోసం అవసరమైనది. సీ ఐ టీ య ూ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ దీని కోసం పోరాడతాయని, కార్మికులందరినీ ఐక్యంగా పోరాడమని పిలుపునిస్తుంది. ఈ ప్రెస్ రిలీజ్ సుప్రీం కోర్టు వ్యాఖ్యలను ప్రో-ఎంప్లాయర్ (యజమానులకు అనుకూలం), ఫాల్స్ (తప్పుడు) అని ఖండిస్తోంది. మహిళల ఆరోగ్య హక్కులను రక్షించాలని, వివక్షను అరికట్టాలని డిమాండ్ చేస్తోంది.

## చంద్రబాబు పాయకరావుపేట నియోజకవర్గం పర్యటన నేపథ్యంలో మంత్రుల సమీక్ష సమావేశం

### భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయాలన్న అనిత, రవీంద్ర



**నక్కపల్లి, పతాకం న్యూస్:** ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాయకరావుపేట నియోజకవర్గం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై సోమవారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో కూటమి నేతల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో భద్రతా బందోబస్తు, కార్యక్రమ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. పర్యటనకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో జనసమీకరణ, ఆహారం, రవాణా తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి తొలిసారి పాయకరావుపేటకు వస్తున్న నేపథ్యంలో భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి అనిత అధికారులకు సూచించారు. రూ. 1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో జిల్లాలో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రణాళికలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ లక్ష్యాలను ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ ఆశయాలు, ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో జోన్-1 కోఆర్డినేటర్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కార్పొరేషన్ చైర్మన్లు మల్ల సురేంద్ర, పి.జి.వి.ఆర్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు



**మల్కాపురం, పతాకం న్యూస్ :** శ్రీహరిపురం జీవీఎంసీ హైస్కూల్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్చార్జి శ్రీ ఎం.ఎస్. ప్రకాశరావు మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు గారి త్యాగం వల్లే నేడు తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సీరం ఉమామహేశ్వరి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఇన్చార్జి శ్రీ సీతారాం, సీనియర్ తెలుగు పండితులు శ్రీమతి పి. ఉమా లక్ష్మీకాంతం మరియు విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

## పంచగ్రామాల సమస్యపై పాదయాత్ర



**వేపగుంట, పతాకం న్యూస్:** పంచ గ్రామాల సమస్యపై సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సింహాచలం జంక్షన్ తొలిపావంచ నుండి విరాట్ నగర్ ప్రహ్లాదపురం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా టివి. కృష్ణంరాజు మాట్లాడుతూ, ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోనికి రాగానే పంచ గ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం తప్ప పరిష్కారం దిశగా ప్రయత్నం చేయటంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఈ ప్రాంత ఎమ్మెల్యేలు పంచ గ్రామాల భూ సమస్యపై మాట్లాడుతూ 1903 సర్వే సెటిల్మెంట్ (గిలమెన్) రికార్డు ప్రకారం రైతుకు హక్కులు ఉన్నాయని, భూముల రికార్డులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఇదే విషయాన్ని పంచ గ్రామాల రైతులు, ఇల్లు, స్థల యజమానులు గత పాతికేళ్లుగా చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సమస్యను వచ్చే కార్పొరేషన్ ఎన్నికలలోపు పరిష్కరించాలని, లేకుంటే ఆ ఎన్నికల్లో కచ్చితంగా 17 వార్డులలో ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

## ఆశ్రమ పాఠశాలకు వంట గ్యాస్ కొరత



**అమరావతి, పతాకం న్యూస్:** జీకేవీధి మండలంలోని పలు ఆశ్రమ పాఠశాల్లో వంట గ్యాస్ కొరత ఏర్పడింది. దీంతో వంట చేయడానికి వర్కర్లు, పాఠశాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీలేరు, ధారకొండ ఆశ్రమ పాఠశాలల్లో శుక్రవారం నుంచి గ్యాస్ కొరత ఏర్పడింది. సీలేరు బాలుర గురుకుల పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల, ధారకొండ ఆశ్రమోన్నత పాఠశాల, సప్పర్ల ఆశ్రమోన్నత పాఠశాలల్లో వండడానికి వంట గ్యాస్ లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా కట్టెలను వినియోగించి వంట చేస్తున్నారు. అయితే వంట సిబ్బంది అరకొరగా ఉండడంతో కర్రల పొయ్యి మీద వంట చేయడం చాలా కష్టమని వసతి గృహాల కుక్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీలేరు గురుకుల పాఠశాలలో 480 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ వంట చేయడానికి ముగ్గురు సిబ్బంది ఉన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో 277 మంది విద్యార్థులు ఉండగా.. ఒక్కరే కుక్ ఉన్నారు. ధారకొండ ఆశ్రమ పాఠశాలో 275 మంది విద్యార్థులు ఉండగా.. ఒక్కరే కుక్ ఉన్నారు. సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో 275 మంది విద్యార్థులు ఉండగా.. ఒక్కరే కుక్ ఉన్నారు. ఆశ్రమ పాఠశాలకు వంట గ్యాస్ సరఫరాపై ఆయా పాఠశాల వార్డెన్‌లు జీసీసీ గ్యాస్ గోదాం సిబ్బంది, అధికారుల వద్దకు వెళ్లినప్పటికీ హెచ్‌పీసీఎల్ నుంచి అనుమతులు వస్తేనే తప్ప వసతి గృహాలకు గ్యాస్ సరఫరా చేయలేమని చెబుతున్నారని ఆశ్రమ పాఠశాలల సిబ్బంది చెబుతున్నారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలలకు గ్యాస్ కొరత లేకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## బీఎన్ రోడ్డులో ప్రయాణమంటే దుమ్ము దుమారం!



**రావికమతం, పతాకం న్యూస్:** మండలంలోని మేడివాడ నుంచి రావికమతం వరకు బీఎన్ రోడ్డులో ప్రయాణమంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. భారీ వాహనాల రాకపోకల సమయంలో రోడ్డుపై దుమ్ము ఎగసి పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ మార్గంలో చెరువును తలపించేలా గోతులు ఉండేవి. వాహనాల రాకపోలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇటీవల క్వారీ బుగ్గితో గోతులను పూడ్చడంతో ఇప్పుడీ సమస్య ఎదురైంది. గతంలో మండల పరిధిలోని బీఎన్ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో దారుణంగా ఉండేది. దీంతో భారీ వాహనాలు సైతం ప్రమాదాలకు గురయ్యేవి. దీంతో ఇటీవల మేడివాడ నుంచి రావికమతం వరకు గోతులను క్వారీ బుగ్గితో పూడ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇప్పుడు కొత్త సమస్య వచ్చి పడింది. ఈ మార్గంలో వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు దుమ్ము రేగుతోంది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాస్తవానికి చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు కాంట్రాక్టర్ బీఎన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే పూర్తి స్థాయిలో పనులు చేపట్టకపోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

## ఎల్ఐసి పరిరక్షణకు పోరాటాలు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎల్ఐసిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని, సంస్థ పరిరక్షణ కోసం మహిళా ఉద్యోగులు పోరాటాలకు సిద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐసిఇయు విశాఖపట్నం విభాగం ఆతిథ్యంలో 5వ రాష్ట్ర స్థాయి 'వర్కింగ్ ఉమెన్ కన్వెన్షన్' విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కన్వెన్షన్‌ను ప్రారంభించిన ఐద్వా రాష్ట్ర నాయకులు డి.రమాదేవి మాట్లాడుతూ నేడు దేశంలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాహ్య ప్రపంచంలోనే కాకుండా సొంత కుటుంబాల ద్వారా కూడా మహిళలు వేధింపులకు గురవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని, మహిళలు వారి హక్కుల కోసం ధైర్యంగా పోరాడే స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఎయు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రియాంక మాట్లాడుతూ మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో మహిళలకు రక్షణ లేదని ప్రపంచం మొత్తం చెబుతోందని, గణాంకాల ప్రకారం 35 శాతం మంది మహిళలపై దాడులు సొంత కుటుంబ సభ్యుల ద్వారానే జరుగుతుండటం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. మహిళలు కేవలం బాధితులుగా మిగిలిపోకుండా, వారి హక్కుల కోసం 'పోరాడి పోట్లాడే స్థాయిలో' మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలను వ్యతిరేకించడం, శాంతి కోసం పోరాడటం అనేది నేడు ప్రతి ఒక్కరి నినాదం కావాలని ఆమె అన్నారు. యుద్ధాల సమయంలో మహిళలు ఎదుర్కొనే దారుణాలను ప్రస్తావిస్తూ.. యుద్ధం సంభవించిన ప్రతిసారీ మహిళలు శారీరకంగా, మానసికంగా తీవ్రమైన వేధింపులకు గురవుతున్నారని, ఇది వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో పాల్గొన్న నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు ఎల్ఐసి ఐపిఓ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

# డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల



**సీలేరు, పతాకం న్యూస్:** సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి మరోసారి గోదావరి డెల్టాకు 3,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు సీలేరు కాంప్లెక్సు జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు విద్యుదుత్పత్తి ద్వారా విడుదల చేసే నీరు సరిపడడం లేదని, అదనపు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు కోరడంతో ఆదివారం ఉదయం నుంచి డొంకరాయి జలాశయం మెయిన్ డ్యాం నుంచి ఆరు, ఏడు గేట్లు ద్వారా 3,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అలాగే పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం మరో 4,300 కూసెక్కుల నీరు గోదావరి డెల్టాకు వెళుతుందన్నారు. సీలేరు నుంచి గోదావరి డెల్టాకు మొత్తంగా 8 వేల క్యూసెక్కులు నీరు విడుదల అవుతుందన్నారు. గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి అవసరాల నేపథ్యంలో మార్చి 31వ తేదీ వరకు 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో ఆంధ్రా వాటాగా 51 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. విద్యుత్ డిమాండ్ కూడా పెరగడంతో సీలేరు కాంప్లెక్సులోని అన్ని జలవిద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేస్తున్నామని ఎస్ఈ జాకీర్ హుస్సేన్ తెలిపారు.

## 'జిందాల్' లాకౌట్‌కు ఏడాది పూర్తి



**కొత్తవలస, పతాకం న్యూస్:** మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ (జిందాల్ స్టయిన్‌లైస్ లిమిటెడ్) కర్మాగారానికి లాకౌట్ విధించి సోమవారంతో సంవత్సరం పూర్తి అయ్యింది. గతేడాది మార్చి 16న లాకౌట్ ప్రకటించిన యాజమాన్యం అందులో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేసే విషయమై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కర్మాగారంలో సుమారు 300 మంది వరకు కాంట్రాక్టు కార్మికులు, 60 మంది వరకు రెగ్యులర్ కార్మికులు పని చేసేవారు. లాకౌట్ విధించిన తరువాత కొన్ని నెలల పాటు కార్మికులు కర్మాగారం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖాధికారుల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగారు. అయినా ఫలితం శూన్యం. రెగ్యులర్ కార్మికులను ఒడిశాలో ఉన్న జిందాల్ కర్మాగారానికి యాజమాన్యం బదిలీ చేసి వారికి పని కల్పించింది. దీంతో రెగ్యులర్ కార్మికుల సమస్య సమసిపోయింది. కాంట్రాక్టు కార్మికులే ఎటూ చెందకుండా మిగిలిపోయారు. తమకు కూడా న్యాయం చేయాలని ఏసీఎల్, డీసీఎల్, జేసీఎల్ ఇలా కార్మిక శాఖాధికారుల వద్దకు వెళ్లి వేడుకున్నారు. యాజమాన్య ప్రతినిధుల నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో లేబర్ కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. కోర్టుకు వెళితే మరికొన్ని సంవత్సరాలు వరకు సమస్య తేలదని భావించి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. అధికారులతో పని జరగదని భావించి ప్రజాప్రతినిధులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రులు వద్దకు తిరిగారు. అక్కడ కూడా ఎటువంటి న్యాయం జరగలేదు. పోరాటం చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ప్రస్తుతం చాలామందికి పదవీ విరమణ వయసు దాటిపోయింది. దీంతో కనీసం తమకు రిటైర్మెంట్ ప్రయోజనాలైనా కల్పించాలని కోరినా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఫైనల్ సెటిల్మెంట్ చేస్తే తీసుకోవడానికి సిద్ధమని కొందరు కార్మికులు ప్రకటించినా యాజమాన్యం నుంచి స్పందన లేదు. లాకౌట్ విధించి సంవత్సరం పూర్తికావడంతో కార్మిక సంఘాలు కూడా నిర్వీర్యం అయ్యే దశకు చేరుకున్నాయి. గతంలో కర్మాగారంలో టీఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైసీపీ కార్మిక సంఘాలు ఉండగా, ప్రస్తుతం ఇందులో రెండు కార్మిక సంఘాలు మనుగడలో లేకుండా పోయాయి.

## శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం



**శ్రీశైలం, పతాకం న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగం.. శక్తిపీఠమైన శ్రీశైల మహా క్షేత్రంలో సోమవారం నుంచి ఉగాది మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు ఈనెల 20వ తేదీ వరకు జరుగుతాయి. ఇందులో భాగంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, విశేష అలంకరణలు, వాహన సేవలు, నిర్వహిస్తారు. మహోత్సవాలు జరిగే ఐదురోజుల పాటు గర్భాలయ అభిషేకాలు, స్పర్శ దర్శనాలు పూర్తిగా నిలుపుదల చేసి అందరికీ అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

**వాహనసేవలు, అలంకరణలు ఇలా:** 16వ తేదీన భృంగివాహన సేవ, మహాలక్ష్మి అలంకారం. 17న కైలాస వాహనసేవ, మహాదుర్గా అలంకారం. 18న ప్రభోత్సవం, నందివాహనసేవ, అగ్నిగుండ ప్రవేశం మహా సరస్వతి అలంకారం. 19న ఉగాది పర్వదినాన పంచాంగ శ్రవణం, రథోత్సవం, రమావాణి సహిత రాజరాజేశ్వరి అలంకారం. 20న పూర్ణాహుతి, అశ్వవాహన సేవ, భ్రమరాంబదేవి నిజరూప అలంకారం, ఆలయోత్సవం.

## త్యాగస్ఫూర్తికి నిలువెత్తు సాక్ష్యం అమరజీవి పొట్టి శ్రీరాములు



**కోనసీమ, పతాకం న్యూస్:** మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే త్యాగ స్ఫూర్తికి నిలువెత్తు సాక్ష్యంగా పేర్కొంటూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను స్మరించుకుంటూ ఎంపీడీవో ఏ.రాజు, తాహసిల్దార్ ప్రకాష్ బాబు, ఇతర అధికార యంత్రాంగంతో కలిసి సోమవారం ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన ఆత్మత్యాగం తెలుగు ప్రజల చరిత్రలో చిరస్మరణీయమని అధికారులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష, ఆత్మత్యాగం దేశ చరిత్రలో అపూర్వమైన సంఘటనగా నిలిచిందన్నారు. తెలుగు ప్రజల గౌరవం కోసం ఆయన ప్రాణత్యాగం చేయడం ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తుందని చెప్పారు. నేటి తరాలు ఆయన త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.వీర్రాజు, ఏపీఎం సత్తిబాబు, ఏపీఓ అరుణకుమారి, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నార్కోటిక్స్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు మందు నిర్మూలన లక్ష్యంగా చేపట్టే దాడుల్లో లభించిన పదార్థాలను నిల్వ చేసేందుకు (నార్కో టిక్స్) నూతన భవన నిర్మాణం చేప ట్టేందుకు గాను స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఫస్ట్‌క్లాస్ ఏడీజే కోర్టు న్యాయాధికారి పి.భాస్కర రావు ఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న నాలుగు సెంట్ల స్థలానికి కొలతలు వేయించి పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో కోర్టు సూపరింటెం డెంట్లు చంద్రశేఖరరావు, శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ డీఈ ధనుంజయ, తహసీ ల్దార్ గణపతిరావు, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## బాహుదా నదిలో రాత్రిపూట ఇసుక తవ్వకాలు..

### ఇచ్ఛాపురం మీదుగా యథేచ్ఛగా రవాణా



**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** ఇసుకాసురులకు బాహుదా నది వరంలా మారింది. రోజూ రాత్రివేళ బాహుదా నదిలో ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వి.. తరలించేస్తున్నారు. బెల్లుపడ, రత్తకన్న తోటల్లో డంపింగ్ చేస్తున్నారు. ఉదయం వేళ ఇచ్ఛాపురం మీదుగా ప్రతిరోజూ కనీసం 50 నుంచి 100 లోడ్ల వరకూ ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇచ్ఛాపురంతోపాటు ఒడిశా, పరిసర ప్రాంతాలకు అక్రమ రవాణా సాగించి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులు, అధికారులు కళ్లెదుటే ఇసుక తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అన్నిపార్టీల నేతలు ఇసుక అక్రమ వ్యవహారంలో భాగస్వామ్యం కావడంతో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. బాహుదా నది ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో 12 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇచ్ఛాపురం పట్టణంతో పాటు మరో 30 గ్రామాలకు సాగునీటి ప్రధాన ఆధారం కూడా బాహుదే. కానీ నదికి సంబంధించి సరైన నిర్వహణ లేదు. నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, గత పాలకుల తప్పిదాలు, నదిలో నీటి ప్రవాహం మార్పులు తదితర కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బాహుదా నది ఇచ్ఛాపురం చెంత నుంచే ప్రవహిస్తున్నా.. పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చలేకపోతోంది. ఒడిశా ఎగువ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన ప్రాజెక్టులు కింద ప్రాంతంగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారుతోంది. తాజాగా ఇసుక రవాణా, తవ్వకాలు యథేచ్ఛగా సాగుతుండడంతో భవిష్యత్ మరింత ముప్పు తప్పదని ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## హోటళ్లు, దాబాలపై దాడులు.. ఆరు సిలిండర్ల స్వాధీనం



**నరసన్నపేట, పతాకం న్యూస్:** నిబంధనల మేరకు ఎల్‌పీజీ గ్యాస్ పంపిణీ చేస్తున్నామని జిల్లా సివిల్‌సప్లయ్‌శాఖ అధికారి జి.సూర్యప్రకాష్‌రావు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించే ఏజెన్సీలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నరసన్నపేటలో హోటళ్లు, దాబాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదుచేసి ఆరు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వసతిగృహాలను పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యం కలిగించవద్దని, వసతిగృహాలకు పంపిణీ చేసే గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టించవద్దని కోరారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

## అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోండి: పెద్దిరెడ్డి



**నెల్లూరు, పతాకం న్యూస్:** వైసిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్న కూటమి ప్రభుత్వం, అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు సెంట్రల్ జైలులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఇతర వైసిపి నాయకులతో కలిసి ఆయన సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతుందని విమర్శించారు. వైసీపీ (జూ) నేతలపై అక్రమ కేసులు పెట్టి రెండు ఏళ్ళుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హత్య కేసులో అసలైన నేరస్థులను వదిలిపెట్టి పిన్నెల్లి, ఆయన సోదరుడుపై అక్రమ కేసు మోపారని, గతంలో ఎస్పీ సైతం ఈ హత్య కేసులో వారికి సంబంధం లేదు అని చెప్పారని గుర్తు చేశారు. 96 రోజుల నుండి పిన్నెల్లి సోదరులు జైలు జీవితం అనుభవిస్తున్నారని, పిన్నెలి ఆరోగ్యం క్షీణించిందన్నారు. ఛార్జ్ షీట్ వేసి 90 రోజులు పైన అయినా బైయిల్ రాలేదని అన్నారు. ఈ దుశ్చర్యకు తగిన ప్రతిఫలం చంద్రబాబు, లోకేష్ అనుభవిస్తారని ధ్వజమెత్తారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు, రేపు వైయస్ఆర్ సీపీ అధికారంలోకి వస్తే, ఇలాంటి చర్యలే పునరావృతం అవుతాయని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎట్టకేలకు సిట్ విచారణకు హాజరైన అనంతబాబు భార్య



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో రెండో నిందితురాలిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గ అజ్ఞాతాన్ని వీడి, ఈ రోజు సిట్ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. రాజమహేంద్రవరం కోర్టు ఆమెపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో, రక్షణ కోసం ఆమె హైకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు ఆమెకు షరతులతో కూడిన వెసులుబాటు కల్పిస్తూ, ఈ నెల 16 నుండి 30వ తేదీ వరకు ప్రతిరోజూ విచారణకు సహకరించాలని ఆదేశించింది. దీంతో ఆమె ఈరోజు సిట్ ముందు హాజరయ్యారు. ఈ హత్య జరిగిన సమయంలో తాను ఘటనా స్థలంలో లేనని, బంధువులను పరామర్శించేందుకు ఆసుపత్రికి వెళ్లానని లక్ష్మీదుర్గ గతంలో పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. కానీ సాంకేతిక ఆధారాలు, ముఖ్యంగా సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిన సిట్ అధికారులు, ఆమె చెప్పేవన్నీ అబద్ధాలని తేల్చారు. హత్య జరిగిన రాత్రి ఆమె అనంతబాబుతో కలిసే ఉన్నట్లు, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసే సమయంలో కూడా ఆమె పాత్ర ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు ఆమెను నిందితురాలిగా చేరుస్తూ అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలతో ఆమె ఈరోజు విచారణకు హాజరయ్యారు.

## గ్రామ స్థాయి కమిటీల్లో దివ్యాంగులకు చోటు కల్పించాలి

**కోనసీమ, పతాకం న్యూస్:** గ్రామస్థాయిలో ఏర్పాటయ్యే కమిటీల్లో దివ్యాంగుల భాగస్వామ్యాన్ని అనుమతించాలని పారా సిబిఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమరావు అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల పరిధి 18 గ్రామాల్లోని దివ్యాంగులు అందరూ కలిసి "నా భాగస్వామ్యం -- నా హక్కు" కార్యక్రమం నిర్వహించి, ఎంపీడీవో రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బడుగు మహిమారావు మాట్లాడుతూ దివ్యాంగుల భాగస్వామ్యం సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దీనికి ప్రభుత్వం, ప్రజలు అందరు తోడ్పడాలని కోరారు. రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన ల్యాంప్ అడ్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ 2016 దివ్యాంగుల చట్టంలో ఉన్న సామాజిక బాధ్యత, ఆరోగ్యం, ఉపాధి హక్కుల గురించి వివరించారు. పారా డైరెక్టర్ థామస్ పల్లిథానం మాట్లాడుతూ కమిటీలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిడిఓ ఏ.రాజు మాట్లాడుతూ దివ్యాంగులు భాగస్వామ్యం చేయాలని ప్రతి పంచాయతీకి మేము ఆదేశాలు జారీ చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారసంస్థ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ సింహరాయులు, ఆలమూరు బ్లాక్ కోఆర్డినేటర్ దుర్గ, డిబి టెట్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు రాప్తాడు రైల్వే బ్రిడ్జి ప్రారంభం



**అనంతపురం, పతాకం న్యూస్:** ఆగిపోయిన రాప్తాడు ఫోర్ లైన్ రైల్వే బ్రిడ్జిని కేవలం 8నెలలలోపే పూర్తి చేశామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గత కొన్ని ఏళ్లుగా లక్షలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు,వాహనదారులను ఇబ్బంది పెడుతున్న రాప్తాడు ఫోర్ లైన్ రైల్వే బ్రిడ్జి ఎట్టకేలకు పూర్తైంది. బ్రిడ్జి ప్రారంభోత్సవం ఆట్టహాసంగా సాగింది. ముందుగా బ్రిడ్జిని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆతర్వాత భారీగా పాల్గన్న నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు నడుమ పూజలు నిర్వహించి బ్రిడ్జిని ఎమ్మెల్యే సునీత ప్రారంభించారు. ఒక పండుగ వాతావరణంలో బ్రిడ్జి ప్రారంభోత్సవం జరిగింది. ఎమ్మెల్యే సునీత స్వయంగా బ్రిడ్జిపై ప్రదర్శనగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో 2017లో 74కోట్ల రూపాయలతో బ్రిడ్జి మంజూరైందన్నారు. 1.8కిలోమీటర్ల మేర 42 మరియు 44వ జాతీయ రహదారులను కలపడంతో పాటు బెంగళూరు, హిందూపురం, పెనుగొండ, మడకశిర, పావగడ, రాప్తాడు నియోజకవర్గాల ప్రజలు అనంతపురం పట్టణంలోకి రావడానికి మరియు బళ్లారి, గుత్తి, రాప్తాడు వైపుల నుంచి వచ్చే వాహనాలు తిరుపతి, చెన్నై వెళ్లడానికి ఈ బ్రిడ్జి ఉపయోగపడేలా ప్లాన్ చేశారన్నారు. రైలు వచ్చే సమయంలో గేటు వేసినప్పుడు వాహనదారులు ఎక్కువసేపు నిరీక్షించే పరిస్థితి ఉండేదన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం వచ్చేవారు మరియు విద్యార్థులు, ఆఫీస్ లకు వెళ్లే ఉద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. 2017లో పనులు ప్రారంభించగా.. 55కోట్ల నిధులతో తమిళనాడుకు చెందిన ఒక కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకొని ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. అయితే 70శాతం పనులు పూర్తి అయ్యాక.. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఈ పనులు ఆగిపోయాయన్నారు. ఆ కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తి చేయనందున పనులను రద్దు చేశారన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించి 25 కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చామన్నారు. ఎస్కేసీ కాంట్రాక్టర్లు కేవలం 8నెలల్లో పై బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల బెంగళూరు–చెన్నై– హైదరాబాద్ మూడు రహదారులను కలిపే విధంగా ఉంటుందని.. ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఇక కష్టాలు ఉండవన్నారు. దాదాపు ఈ బ్రిడ్జి వలన ఏళ్లపాటు నాతో సహా ఎంతో మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ బ్రిడ్జి అనుకున్న సమయానికన్నా ముందే పూర్తిచేసిన కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే సునీత కఅతజ్ఞతలు తెలిపి అభినందించారు. రోడ్డు బాగా ఉందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, బ్రిడ్జిపై అతివేగంగా వెళ్లవద్దని, ఎమ్మెల్యే సునీత ప్రయాణికులకు, వాహనదారులకు సూచించారు. ఇంకా రాప్తాడు పరిసర ప్రాంతాల్లో ఉన్న అనేక పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# నాలుగు రాష్ట్రాల్లో మోగిన ఎన్నికల నగారా



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో మళ్లీ ఎన్నికల హడావుడి మొదలుకానుంది. బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి షెడ్యూల్ అనౌన్స్ చేశారు. తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, కౌంటింగ్ మే 4న ఉంటుంది.


కేరళ: పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న.

తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న.

పశిష్ట్రుమ: పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఉంటుంది. కౌంటింగ్ మే 4.


పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న.

# మమతకు షాక్.. ఇద్దరు కీలక అధికారులపై ఈసీ వేటు



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) సంచలన నిర్ణయం తీసుకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), హోం సెక్రటరీలను ఆ పదవుల నుంచి తప్పించింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ లేఖ రాసింది. ప్రస్తుత చీఫ్ సెక్రటరీ నందిని చక్రవర్తి, హోం సెక్రటరీ జగదీష్ ప్రసాద్ మీనాలను తక్షణమే బదిలీ చేయాలని ఆదేశించింది. వారి స్థానంలో కొత్త చీఫ్ సెక్రటరీగా 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి దుష్యంత్ నరియాలాను, హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా 1997 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి సంఘమిత్ర ఘోష్‌ను నియమించింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలలోగా కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించి, నివేదిక ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు బదిలీ అయిన అధికారులకు ఎలాంటి ఎన్నికల సంబంధిత బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఎన్నికల సన్నాహకాలను సమీక్షించిన తర్వాత, నిష్పాక్షికమైన పోలింగ్ నిర్వహించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే మమతా బెనర్జీ ప్రభుత్వంలోని కీలక అధికారులపై ఈసీ వేటు వేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# పాతపట్నంలో అధ్వానంగా సాగునీటి కాలువలు!



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని సాగునీటి కాలువలు, చెక్‌డ్యాంలు అధ్వానంగా ఉన్నాయి. పూడికలు, పిచ్చి మొక్కలతో కాలువలు నిండిపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. దీంతో సకాలంలో వరి నాట్లు పడడం లేదు. కొన్నిచోట్ల గండ్లు పడి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రతి ఏటా ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు నానా పాట్లు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాలువల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో కూటమి ప్రభుత్వంపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా పనులు మాత్రం జరగకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు ప్రతి ఏటా ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. ఫలితంగా కాలువలు ఆధునికీకరణకు నోచుకోవడం లేదు. పాతపట్నంలో గుమ్మ గెడ్డ, పొగడవిల్లి గెడ్డ ప్రధాన సాగునీటి వనరులు. గుమ్మగెడ్డ ఒడిశా నుంచి వస్తుంది. ఇది ఏఎస్‌కవిటి వద్ద ఆంధ్రాలో ప్రవేశిస్తుంది. పాతపట్నం మండల వ్యాప్తంగా సుమారు 13 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తుంది. దీనిద్వారా ఏఎస్‌కవిటి, చాకిపల్లి, పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, సీది, తామర, తీమర, పాసిగంగుపేట, రొంపివలస, రొమదళ, రౌతులక్ష్మీపురం తదితర పంచాయతీల్లోని 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే, కాలువ అధ్వానంగా ఉండడంతో సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ఒడిశాలోని ఎగువభాగంలో అధికవర్షాలు కురిస్తే గుమ్మ గెడ్డకు వరద పోటెత్తుతుంది. దీంతో ఎక్కడికక్కడే గండ్లు పడి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. సంవత్సరాలుగా కాలువ ఆధునికీకరణకు నోచుకోవడం లేదని రైతులు అంటున్నారు.

పొగడవిల్లి గెడ్డ పాతపట్నం మండల వ్యాప్తంగా సుమారు 9 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తుంది. దీనికి సుమారు 900 ఎకరాల వరకూ ఆయకట్టు ఉంది. తూర్పుభాగంలో ఉన్న కొండల నుంచి వచ్చే నీటిలో కొంతభాగం పొగడవిల్లి గెడ్డ ద్వారా తెంబూరులోని అసర్లసాగరంలో కలుస్తుంది. మిగతాభాగం హిరమండలం మండల పరిధిలోని ధనుపురం మీదుగా వంశధారనదిలో కలుస్తుంది. అసర్లసాగరం ద్వారా టెక్కలి, సారవకోట మండలాల పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ధనుపురం మీదుగా వెళ్లే నీరు హిరమండలంలోని అనేక గ్రామాలకు ఎక్కువగా ఉపయోపగపడుతుంది. ప్రతిఏటా వర్షాకాలంలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. అయితే, కొండ దిగువకు నీరు చేరేసరికి ఆ ఉధృతికి కాలువకు గండ్లు పడి పాతపట్నం మండపరిధిలోని బి.గోపాలపురం మొదలుకొని గంగువాడ, సింగుపురం, పెద్దలోగిడి, చిన్నలోగిడి వరకూ ఉండే పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కాలువలో పిచ్చిమొక్కలు, పూడుక పేరుకుపోవడంతో ఎక్కడికక్కడే గండ్లు పడుతున్నాయని, అధికారులకు సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఈ రెండు కాలువలను బాగు చేయాలని కోరుతున్నారు.

# ఉన్నది 15 రోజులే! ఈలోపు 'ఉపాధి' కాంపోనెంట్ పనులు పూర్తయ్యేనా?



**రాజాం, పతాకం న్యూస్:** ఈ పరిస్థితి ఒక్క రాజాం నియోజకవర్గంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా ఉంది. అన్ని నియోజకవర్గాల్లో దాదాపు రూ.80 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సమయం చూస్తే కేవలం 16 రోజులు మాత్రమే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో ఈ నిధులు వినియోగిస్తే సరి.. లేకుంటే మాత్రం మురిగిపోతాయి. వేతనదారులకు ఉపాధి కల్పించడం ఉపాధి హామీ పథకం లక్ష్యం. మరోవైపు కాంపోనెంట్ నిధుల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి. ముఖ్యంగా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలి. అయితే గత ప్రభుత్వ హయాంలో 2019–24 మధ్య దాదాపు రూ.1,062 కోట్లు నిధులు మురిగిపోయాయి. గత ఏడాది జిల్లాలో రూ.100 కోట్లు వినియోగించకపోవడంతో అవి కూడా మరుగునపడిపోయాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. కనీసం 50 శాతం పనులు పూర్తిచేయడం కష్టమేనని తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యంగా పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్‌శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పల్లెపండుగ పేరుతో భారీ స్థాయిలో సీసీ రహదారులు, కాలువల నిర్మాణం చేపడుతూ వస్తోంది. అయితే అధికారులు ఉదాసీనత పుణ్యమా అని పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పుడు ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో నిధులు మరుగునపడే అవకాశం ఉంది. ఎస్.కోట నియోజకవర్గంలో రూ.45.07 కోట్లు ఖర్చుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటివరకూ రూ.28.75 కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగారు. ఇంకా రూ.16.32 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. విజయనగరంలో రూ.3.99 కోట్లకుగాను రూ.1.20 కోట్లు ఖర్చుచేశారు. ఇంకా రూ.2.79 కోట్లు ఉన్నాయి. బొబ్బిలిలో రూ.24.26 కోట్లకుగాను రూ.11.69 కోట్లు ఖర్చు చేయగా ఇంకా రూ.11.69 కోట్లు మిగిలి ఉన్నాయి. చీపురుపల్లిలో రూ.23.37 కోట్లకుగాను రూ.8.82 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంకా రూ.14.45 కోట్లు వ్యయం చేయాల్సి ఉంది. గజపతినగరంలో రూ.29.98 కోట్లకుగాను రూ.12.24 కోట్లు ఖర్చుచేశారు. రూ.17.74 కోట్లు మిగిలి ఉన్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో రూ.5.18 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా.. రూ.3.07 కోట్లు ఖర్చుచేశారు. ఇంకా రూ.2.11 కోట్లు ఖర్చుపెట్టాల్సి ఉంది. ఈ నిధులను ఉపయోగించేందుకు 16 రోజులు మాత్రమే ఉంది. ఇంతలో పనులు పూర్తిచేయడం సాధ్యమేనా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

# విద్యార్థినీ విద్యార్థులకు చట్టాలపై అవగాహన



**ప్రకాశం, పతాకం న్యూస్:** గుడ్లూరు మండలంలోని చేవూరు గ్రామంలో నిన్న వెలుగులోనికి వచ్చిన బాల్య వివాహం పై ఒంగోలు .పి.డి. నాగమణి ఆదేశాల మేరకు చేవూరు జడ్పీహెచ్ స్కూల్ లోని విద్యార్థినీ .విద్యార్థులకు. అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ జ్యోతి సుప్రియ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని. బాల్యవాహాలను ప్రోత్సహించిన వారికి. బాల్యవాలకు హాజరైన వారికి. బాల్య వివాహం. జరిపించిన తల్లిదండ్రులకు .పెద్దలకు చట్టరీత్యా కఠినమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని .అనంతరం కుటుంబం ఎదురుకునే సమస్యలను విద్యార్థిని విద్యార్థులకు వివరించడం జరిగింది. ముఖ్యంగా చిన్నవయసులో వివాహం చేసుకోవడం వలన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని. శారీరకంగా. మానసికంగా .ఎదుగుదల ఉండదని. గర్భవతి అయిన సమయంలో తల్లి .బిడ్డ .ప్రాణాలకు కూడా ప్రమాదం ఉందని తెలియపరిచారు. అంతేకాకుండా చిన్న వయసులో చట్టరీత్యా నేరస్తులుగా పరిగణించబడితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు రావని. కొన్ని సందర్భాలలో తెలిసి చేసిన తెలియక చేసిన శిక్షార్హులవుతారని . చట్టాలపై అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ జ్యోతి సుప్రియ. ఉలవపాడు ప్రాజెక్టు సిడిపిఓ మాధవి లత. సూపర్వైజర్ కామేశ్వరి. జడ్పీహెచ్ స్కూల్ టీచర్స్. ఎంవి శోభ రాణి. ఆదిలక్ష్మి. జ్ఞాన ప్రసన్న. అంగన్వాడీ కార్యకర్తలు కొమరగిరి సునీత.నళిని. హెలెన్. విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫాస్టాగ్ వార్షిక పాస్ ధర రూ.75 పెంపు

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** : దేశంలోని జాతీయ రహదారులపై వాహనదారులు అతి తక్కువ ఖర్చుతో ప్రయాణించేందుకు వీలుగా తీసుకొచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) రూ.75 పెంచింది. ప్రస్తుతం ఈ పాస్ ధర రూ.3వేలు ఉండగా.. వచ్చే ఏప్రిల్ 1 నుంచి దీన్ని రూ. 3,075కు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు 2026–27 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తుంది. జాతీయ రహదారులపై తరచుగా ప్రయాణించే వాహనదారులకు ఆర్థిక భారం తగ్గించే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా 1,150 జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద చెల్లుబాటయ్యేలా గతేడాది ఆగస్టు 15న వార్షిక పాస్‌ను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ పాస్ తీసుకుంటే ఏడాదిపాటు లేదా రెండు వందలసార్లు (ఏది ముందైతే అది) టోల్‌ప్లాజాలు దాటే అవకాశం ఉంటుంది. చెల్లుబాటయ్యే ఫాస్టాగ్ కలిగిన అన్ని నాన్ కమర్షియల్ వాహనాలకు ఇది వర్తిస్తుంది.

## ‘వజ్ర పహార్’లో 26 వాహనాలు సీజ్



**బాపట్ల, పతాకం న్యూస్:** మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా బాపట్ల జిల్లా పోలీసులు తెల్లవారుజామున భారీ ‘కార్డన్ అండ్ సెర్చ్’ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు ‘వజ్ర పహార్’ కార్యక్రమంలో భాగంగా కర్లపాలెం మండలంలోని పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో బాపట్ల డిఎస్పీ జగదీశ్ నాయక్ ఆధ్వర్యంలో.. రూరల్ సర్కిల్ సీఐ బి.హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర తమ సిబ్బందితో కలిసి కర్లపాలెం, గౌడ పాలెం, రాజీవ్ నగర్ ప్రాంతాలను చుట్టుముట్టారు. ప్రతీ ఇంటిని, అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 26 మోటారు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఆయా ప్రాంతాల్లోని అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా సీఐ హరికృష్ణ మాట్లాడుతూ... అపరిచిత వ్యక్తులకు ఇళ్ళు అద్దెకు ఇచ్చే ముందు వారి వివరాలను పూర్తిగా సేకరించాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు ఇటువంటి ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు.. నలుగురికి గాయాలు



**నంద్యాల, పతాకం న్యూస్:** రుద్రవరం మండలంలోని ముత్తలూరు గ్రామ మెట్ట సమీపంలో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు .... ఆదివారం రాత్రి అహోబిలం వైపు నుంచి ఆళ్లగడ్డకు వస్తున్న కారు ముత్తలూరు మెట్ట మలుపు దగ్గర అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలు అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడినవారిని 108 వాహనం ద్వారా ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అన్నారు. కారులో ప్రయాణిస్తున్నవారు తెలంగాణ వాసులుగా తెలుస్తోంది. ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## జీడికి గిట్టుబాటు ధర కల్పించి, బోర్డు ఏర్పాటు చేయాలి



**చిత్తూరు, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో జీడి కి గిట్టుబాటు ధర కల్పించి, జీడి బోర్డ్ ఏర్పాటు చేస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకట్రావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఎం పార్టీ నాయకులు ఎన్ గణపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలాసలో సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ .... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి జీడి బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీని ఎప్పుడు అమలు చేస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని ప్రశ్నించారు. గత ఆరు సంవత్సరాల నుండి జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని అనేక ఆందోళనలు సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అని అన్నారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిక్కల ధర పాతాళంలో ఉందని పప్పు ధర చూస్తే ఆకాశాన్ని అంటుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే జీడి రెండో స్థానంలో ఉందని అన్నారు. మన జిల్లాలో ఉద్దానం తీర ప్రాంతము, గిరిజన ప్రాంతంలో విస్తారంగా జీడి పంటుందని, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర ఇవ్వడం వలన జీడి విస్తారంగా పండించి జీడి ఆధారత పరిశ్రమలు వస్తాయని, తద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, వలసలు నివారించబడతాయని తద్వారా ఈ ప్రాంతం అభివఅద్ధి చెందుతుందని వారు అన్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో ఈడీ దాడులు

**కోల్‌కతా :** అక్రమ కాల్ సెంటర్ కార్యకలాపాలపై దర్యాప్తులో భాగంగా పశ్చిమ బెంగాల్లో సోమవారం ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అధికారులు సోమవారం పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.. సిలిగురి, హౌరా, బిధాన్ నగర్, దుర్గాపూర్‌లలో ఉన్న దాదాపు పది కాల్ సెంటర్లపై సోదాలు నిర్వహించినట్లు ఇడి అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున ఈ ఇడి దాడులు జరగడం గమనార్హం. ఎన్నికల వేళ పలు రాజీయ పార్టీలకు నిధులకు సంబంధించా? లేక ఎన్నికల ప్రక్రియలో చొరవగా పాల్గొనడం దాని గురించి ఇడి దాడులకు పాల్పడిందా అనే దానిపై స్పష్టత లేదు.

## వృద్ధ మహిళ కాళ్లపై ఎక్కిన ఆర్టీసీ బస్సు .. కాలు నుజ్జునుజ్జు





**చిత్తూరు, పతాకం న్యూస్:** మహిళా వృద్ధురాలి కాలిపై ఆర్టీసీ బస్సు ఎక్కిన ఘటన చిత్తూరులో జరిగింది. చిత్తూరు నుంచి పలమనేరు బస్ స్టాండ్ కు వస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు (ఎపి39యువై5994) పలమనేరు టవర్ క్లాక్ వద్ద ప్రమాదానికి గురైంది. ఘంటా ఊరు కాలనీకి చెందిన వృద్ధ మహిళ కామాక్షమ్మపై బస్సు ముందు చక్రం ఎక్కింది. రెండు కాళ్లపై నుంచి బస్సు చక్రం వెళ్లడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి ఆమె రెండు కాళు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను పలమనేరు ఏరియా ఆసుపత్రికి 108 లో తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వసతి గృహాల్లో అధికారుల తనిఖీలు



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరం ప్రతినిధివసతి గృహాల్లో గ్యాస్ కొరత లేదని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.పార్వతి తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టు వండేందుకు తగిన పెద్ద గ్యాస్ స్టవ్‌లు లేకపోవటంతో హాస్టల్స్ నిర్వాహకులు కట్టెల పొయ్యిపై వంట చేయిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.పార్వతి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగజ్యోతి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సుబ్బారావు హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. రాజమహేంద్రవరంలోని పిఎంఎస్ బాయ్స్ హాస్టల్–1, బాలికల హాస్టల్స్ 1, 3, పోస్ట్ మెట్రిక్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ 2, 3తో పాటు బిసి వెల్ఫేర్ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్, గణేష్ మార్కెట్‌లోని హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్స్‌లో గ్యాస్ కొరత లేదని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు.

# మహిళల్లో అధికంగా వచ్చే వ్యాధులు..!



మహిళల్లో అధికంగా వచ్చే వ్యాధులు ఇవే.. ముందుగానే గుర్తిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.. మహిళల ఆరోగ్యం జీవశాస్త్రం, హార్మోన్ల కారణంగా కొన్ని వ్యాధులు పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయి. పురుషులు, మహిళలు కొన్ని వ్యాధులకు సమానంగా గురవుతారు. కానీ హార్మోన్ల మార్పులు, పునరుత్పత్తి ఆరోగ్యంతో సంబంధం ఉన్న సమస్యలు మహిళల్లో ఎక్కువగా ఉంటాయి. మహిళల ఆరోగ్యం జీవశాస్త్రం, హార్మోన్ల కారణంగా కొన్ని వ్యాధులు పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయి. పురుషులు, మహిళలు కొన్ని వ్యాధులకు సమానంగా గురవుతారు. కానీ హార్మోన్ల మార్పులు, పునరుత్పత్తి ఆరోగ్యంతో సంబంధం ఉన్న సమస్యలు మహిళల్లో ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా థైరాయిడ్ సమస్యలు, పిసిఓఎస్/పీసీఓడీ, ఆటోఇమ్యూన్ వ్యాధులు, ఆస్టియోపొరోసిస్, రక్తహీనత వంటి సమస్యలతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మహిళలు ఇబ్బందిపడుతున్నారు. ఈ వ్యాధులు పురుషుల కంటే మహిళల్లో చాలా ఎక్కువగా కనిపిస్తాయని అయినప్పటికీ ఈ వ్యాధులను చాలా మంది సరైన సమయంలో గుర్తించరని వైద్యులు చెబుతున్నారు. పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపించే కొన్ని వ్యాధుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### థైరాయిడ్, పీసీఓఎస్..

భారతదేశంలో ప్రతి 10 మంది మహిళల్లో ఒకరు థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నారని అంచనా. థైరాయిడ్ అనేది ఎండోక్రైన్ వ్యవస్థలో భాగమైన చిన్న సీతాకోకచిలుక ఆకారంలో ఉన్న గ్రంథి. ఇది మెడ ముందు భాగంలో చర్మం కింద ఉంటుంది. ఈ గ్రంథి థైరాక్సిన్, ట్రైయోడోథైరోనిన్ అనే హార్మోన్లను విడుదల చేస్తుంది. ఇవి శరీరంలోని అనేక ముఖ్యమైన పనులను నియంత్రిస్తాయి. దాదాపు 15.86% మహిళల్లో థైరాయిడ్ సమస్యలు కనిపిస్తున్నాయి. అలాగే మహిళల్లో ఎక్కువగా కనిపించే మరో సమస్య పిసిఓఎస్/పీసీఓడీ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్). పిసిఓఎస్/పీసీఓడీ అనేది మహిళల్లో కనిపించే సాధారణ హార్మోన్ల సమస్య. ఇందులో ఆండ్రోజెన్ హార్మోన్లు సాధారణ కంటే ఎక్కువగా ఉంటాయి. దీంతో పీరియడ్స్ సరిగ్గా రాకపోవడం, అండోత్పత్తి సమస్యలు, గర్భం దాల్చడంలో ఇబ్బందులు, ముఖం లేదా శరీరంపై ఎక్కువ వెంట్రుకలు, మొటిమలు వంటి సమస్యలు వస్తాయి.

### ఆటో ఇమ్యూన్ వ్యాధులు, ఆస్టియోపోరోసిస్..

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రసవ వయస్సులో ఉన్న మహిళల్లో 10-13% మందికి ఉంటుంది. కానీ ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70% మహిళలకు తమకు ఉందని తెలియదు. వీటితో పాటు ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా మహిళల్లో ఎక్కువగా వస్తున్నాయి. ఆటోఇమ్యూన్ వ్యాధుల్లో శరీరంలోని ఇమ్యూన్ సిస్టమ్ తప్పుగా ఆరోగ్యకరమైన కణాలపై దాడి చేస్తుంది. దీని వల్ల రుమటాయిడ్ ఆర్థరైటిస్, క్రోన్స్ వ్యాధి, థైరాయిడ్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

ఇవి దీర్ఘకాలిక వ్యాధులు కనుక వీటి లక్షణాలను జీవితకాలం నియంత్రించుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా ఆస్టియోపొరోసిస్‌ను ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే వ్యాధిగా భావించేవారు. కానీ ఇప్పుడు 30-40 సంవత్సరాల మహిళల్లో కూడా ఎముకలు బలహీనపడటం కనిపిస్తోంది. ఆస్టియోపొరోసిస్ ఒక ఎముకల వ్యాధి. ఇందులో ఎముకల సాంద్రత తగ్గడంతో పాటు ఎముక నిర్మాణం బలహీనపడుతుంది. దీంతో ఎముకలు సులభంగా విరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. చిన్న గాయం కారణంగా కూడా ఫ్రాక్చర్ వచ్చే అవకాశంపెరుగుతుంది. ఆస్టియోపొరోసిస్‌ను చాలాసార్లు సైలెంట్ డిసీజ్ అని పిలుస్తారు. ఎందుకంటే ఎముక విరిగే వరకు సాధారణంగా లక్షణాలు కనిపించవు.

### రక్తహీనత..

ఐరన్ డెఫిషియెన్సీ అనీమియా ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణ పోషక లోప వ్యాధుల్లో ఒకటి. పీరియడ్స్, గర్భధారణ, ఆహారపు అలవాట్ల కారణంగా మహిళలు దీనికి ఎక్కువగా గురవుతూ ఉంటారు. ఈ వ్యాధి రక్తంలోని రెడ్ బ్లడ్ సెల్స్‌ను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారిలో తీవ్రమైన అలసట, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధికి సాధారణంగా ఐరన్ మాత్రలు లేదా ఐరన్ ఇన్ఫ్యూషన్ల ద్వారా చికిత్స చేస్తారు. మహిళల్లో కనిపించే ఈ ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, సరైన ఆహారం తీసుకోవడం, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ఉండడం ద్వారా ఈ వ్యాధులను నియంత్రించవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్లకు చెక్

## జిల్లాలో 10,755 మంది బాలికలకు వ్యాక్సిన్ వేయాలని లక్ష్యం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్‌కి కారణమైన హెచ్‌పీవీ వైరస్ నివారణకు గార్డాసిల్ టీఎం టీకా కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) కారణంగా మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ వస్తుంది. దీన్ని నివారించడానికి 14 ఏళ్లు నిండి 15 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగా టీకా వేస్తున్నారు. టీకా వేసుకోవడం వలన హెచ్‌పీవీ వైరస్ కారణంగా స్త్రీలలో వచ్చే ప్రాణాంతక గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. జిల్లాలోని 9 యూపీహెచ్‌లు, 50 పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 14 నిండి 15 ఏళ్లలోపు బాలికలు జనాభాలో 1 శాతం ఉంటారని అంచనా వేస్తున్నారు. జిల్లాలో 10,755 మంది బాలికలకు టీకాలు అవసరమని అంచనా వేశారు. మొదటి విడతగా 5,910 డోసులు సిద్ధం చేశారు. తరువాత మిగిలిన డోసులు పంపిణీ చేస్తారు. టీకా కార్యక్రమం ఈ నెల 11న ప్రారంభంకాగా, ఇప్పటి వరకు 1,055 మంది బాలికలకు టీకా వేశామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్రశేఖర్ దేవ్ తెలిపారు. మూడు నెలల్లో టీకా కార్యక్రమాన్ని ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సర్వైకల్ క్యాన్సర్ అంటే గర్భాశయ దిగువ భాగంలో ఏర్పడుతుంది. ఇది ఎక్కువగా ఇన్‌ఫెక్షన్ వల్ల అభివృద్ధి చెందే వ్యాధి. సర్విక్స్‌లోని కణాలు అసహజంగా మారి నియంత్రణ లేకుండా పెరగడం వల్ల క్యాన్సర్‌కు కారణమవుతుంది. ఈ క్యాన్సర్‌కు ప్రధాన కారణం హ్యూమన్ పాపిల్లోమా వైరస్(టైప్ 16, 18) కణాల్లో మార్పు వల్ల క్యాన్సర్‌కు దారి తీస్తుంది. హెచ్‌పీవీ ఎక్కువగా స్కిన్ టు స్కిన్ కాంటాక్ట్ ద్వారా వస్తుంది. వీటితో పాటు చిన్నవయస్సులోనే లైంగిక జీవితం ప్రారంభించడం, ఎక్కువ మందితో లైంగిక సంబంధం కలిగి ఉండడం వల్ల హెచ్‌పీవీ ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇన్‌ఫెక్షన్ సులభంగా వ్యాప్తి చెందుతుంది. మహిళల్లో అధిక శాతం మంది సర్వైకల్ క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నారు. మహిళలకు వచ్చే అత్యంత ప్రమాదకరమైనది సర్వైకల్ క్యాన్సర్ అని డాక్టర్లు చెబుతున్నారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో భవిష్యత్తు తరాలకు ఆరోగ్య భద్రత కల్పించడమే కాకుండా క్యాన్సర్ రహిత సమాజ స్థాపనకు పునాది కానున్నదని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాక్సిన్‌ను 14 ఏళ్లు నిండి 15 ఏళ్ల వయస్సులోపు బాలికలకు కేవలం ఒక్క డోసు మాత్రమే ఇస్తారు. గతంలో వ్యాక్సిన్ వేయించుకున్నవారికి మళ్లీ ఇవ్వరు. నాలుగు రకాల క్యాన్సర్లను ఈ టీకా నిరోధిస్తుందని వైద్యులు చెబుతున్నారు. 0.5 ఎంఎల్‌ను ఇంజెక్షన్ రూపంలో ఇవ్వనున్నారు. ప్రస్తుతం దీని ధర మార్కెట్లో రూ.4 నుంచి రూ.8 వేల వరకు ఉంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ వ్యాక్సిన్‌కు కనీసం రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. గార్డాసిల్ టీఎం టీకా వేసుకునే బాలికలు ఖాళీ కడుపుతో ఉండకూడదు. అల్పాహారం, భోజనం చేసి ఉన్నారని నిర్ధారించుకున్న తరువాతే టీకా వేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. టీకా వేసిన తరువాత 30 నిమిషాలు వేచి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. టీకా వేసిన తరువాత తేలికపాటి జ్వరం, టీకా వేసిన చోట నొప్పి, వాపు ఉంటే పారాసిటమాల్ టాబ్లెట్ ఇవ్వాలని సిబ్బందికి సూచిస్తున్నారు. ఒకవేళ తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటే ఆస్పత్రిలో ఉంచి వైద్య సేవలు అందించాల్సి ఉంది.

# నాటో దేశాలకు ట్రంప్ వార్నింగ్




**వాషింగ్టన్:** పశ్చిమాసియా యుద్ధం ముదురుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన యూరోపియన్ మిత్రదేశాలపై నిప్పులు చెరిగారు. నార్త్ అట్లాంటిక్ ట్రైటీ ఆర్గనైజేషన్ (నాటో) భవిష్యత్తుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పరిస్థితి "చాలా దారుణంగా" ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ అడ్డంకుల వల్ల మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని నాటో కూటమిని ఆయన డిమాండ్ చేశారు. హర్మూజ్ జలసంధి ద్వారా చమురు పొందుతున్న దేశాలు తమ సొంత నౌకల రక్షణ కోసం ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. "అందరి కోసం అమెరికా ఒక్కటే కాపలా కాయలేదు. ఈ కీలక మార్గాన్ని తెరిపించేందుకు జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ యుద్ధనౌకలను పంపించాలి. నాటో దేశాలు తమ బాధ్యతను నెరవేర్చకుంటే ఆ కూటమి భవిష్యత్తు ప్రశ్నార్థకమే" అని ఆయన హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్‌పై అమెరికా జరిపిన బాంబు దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. చమురు సరఫరాను అడ్డుకుంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని, దానిని అడ్డుకోవడానికి ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనకాడబోమని చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలతో నాటో కూటమిలో ఒక్కసారిగా కలకలం రేగింది. పశ్చిమాసియా యుద్ధంలో నేరుగా పాల్గొనడానికి యూరోపియన్ దేశాలు మొగ్గు చూపకపోవడంతో, అమెరికా, దాని మిత్రదేశాల మధ్య దూరం పెరుగుతోందనే చర్చ మొదలైంది.

## యూఏఈలో 19 మంది భారతీయుల అరెస్ట్

**యూఏఈ:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారనే ఆరోపణలపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనలో మొత్తం 35 మందిని అరెస్ట్ చేయగా, వారిలో 19 మంది భారతీయులు ఉండటం గమనార్హం. వీరిని వేగవంతమైన విచారణ కోసం అధికారులు కోర్టుకు సిఫార్సు చేశారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు సంబంధించి ప్రజలను భయాం 1దోళనలకు గురిచేసేలా, దేశంలో అస్థిరత సృష్టించేలా ఫేక్ పోస్టులు పెట్టారని వీరిపై అభియోగాలు నమోదయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో సృష్టించిన నకిలీ వీడియో క్లిప్‌లు, క్షిపణి దాడుల వీడియోలకు భయానక వ్యాఖ్యానాలు జోడించి సర్క్యులేట్ చేశారని యూఏఈ అటార్నీ జనరల్ డాక్టర్ హమద్ సైఫ్ అల్ షమ్సీ వెల్లడించారు. మార్చి 14, 15 తేదీల్లో రెండు విడతలుగా ఈ అరెస్టులు జరిగాయి.




## భవిష్యత్తులో టీమిండియా మరిన్ని కప్పులు గెలుస్తుంది: సంజు శాంసన్




టీమిండియా టీ20 ప్రపంచ కప్ 2026 గెలవడంలో స్టార్ బ్యాటర్ వికెట్ కీపర్ సంజు శాంసన్ కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. అనూహ్యంగా జట్టులోకి వచ్చి వరుసగా మూడు హాఫ్ సెంచరీలు నమోదు చేసిన సంజు.. 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును అందుకున్నాడు. అయితే తాజాగా బీసీసీఐ ప్రపంచ కప్ ఛాంపియన్స్‌కు నమన్ అవార్డ్స్ ప్రదానం చేసింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న సంజు.. జట్టు గెలుపుపై మాట్లాడాడు. భారత క్రికెట్ జట్టు భవిష్యత్తులో మరిన్ని ఐసీసీ ట్రోఫీలు గెలుచుకుంటుందని అన్నాడు. 'టీ20 ప్రపంచ కప్ 2026 గెలవడం నిజంగా జరిగిందా అనిపిస్తోంది. మన దేశంలో ఉన్న ఆటగాళ్ల ప్రతిభ, సామర్థ్యాన్ని చూస్తే రాబోయే ఏళ్లల్లో టీమిండియా ఎన్నో విజయాలు అందుకుంటుంది. యువ ప్లేయర్ల వల్ల ప్రపంచ క్రికెట్‌లో భారత్.. అద్భుతాలు చేస్తుంది. ఇలాంటి ఐసీసీ ట్రోఫీలు మరెన్నో అందుకుంటుందని విశ్వసిస్తున్నా. మనకు కావాల్సిన లక్ష్యాలను కలగనొచ్చు. కానీ ఆ దారి ఎలా సాగుతుందో ముందే చెప్పలేం. నా కెరీర్ కూడా అలాంటిదే. రెండేళ్ల క్రితమే దేశానికి ప్రపంచ కప్ గెలిపించాలని అనుకున్నాను. కానీ పరిస్థితులు వేరేగా మారాయి. చివరికి నా జర్నీ అంతా ఓ సినిమాలా అనిపిస్తుంది. జింబాబ్వే మ్యాచ్ నుంచి జట్టుకు నేను అవసరం అనే భావన వచ్చింది. అదే నాలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది' అని సంజు తెలిపాడు.

## పొగమంచు కారణంతో

# సాగని భారత్-దక్షిణాఫ్రికా నాలుగో టీ20



బీసీసీఐ నమన్ పురస్కారాల ప్రదానోత్సవం ఇక్కడ అత్యంత ఉల్లాస, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. దేశ క్రికెట్ సీనియర్, జూనియర్ పురుషులు, మహిళా జట్ల క్రికెటర్లు, ఉద్దండులైన మాజీ ఆటగాళ్లు హాజరైన ఈ వేడుక..దేశ క్రికెట్ ప్రపంచాన్ని కళ్లకు కట్టింది. ఏడాది కాలంలో భారత పురుషులు, మహిళల సీనియర్, జూనియర్ జట్లు నాలుగు పరిమిత ఓవర్ల ప్రపంచ కప్‌లు గెలవడంతో ఈ కార్యక్రమం మరింత ప్రతిష్ఠాత్మకమైంది. 2024-25లో అద్భుత ప్రదర్శన చేసిన స్టార్ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, స్మృతీ మంధాన 'పాలీ ఉమ్రిగర్' అత్యుత్తమ అంతర్జాతీయ క్రికెటర్ల అవార్డులు అందుకున్నారు. గిల్‌కు ఈ పురస్కారం దక్కడం ఇది రెండోసారి. 2023లో అతడు ఈ అవార్డు పొందాడు.

మంధానకు ఐదోసారి ఈ అవార్డు లభించడం విశేషం. భారత క్రికెట్‌కు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్, మిథాలీ రాజ్‌లకు బీసీసీఐ అత్యున్నత కల్నల్ సీకే నాయుడు జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు.

ఐసీసీ అధ్యక్షుడు జై షా అవార్డులు అందజేశారు. అంతేకాదు ఐదు ఐసీసీ ట్రోఫీలు (2025 చాంపియన్స్ ట్రోఫీ, 2025 మహిళల వన్డే వరల్డ్ కప్, 2025 అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్, 2026 అండర్-19 వన్డే వరల్డ్ కప్, 2026 పురుషుల టీ20 వరల్డ్ కప్) గెలిచిన జట్లను కూడా సన్మానించారు.

వన్డే వరల్డ్ కప్ సాధించిన మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, టీ20 ప్రపంచ కప్ సొంతం చేసుకున్న పురుషుల జట్టు సారథి సూర్యకుమార్, చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన పురుషుల జట్టు కెప్టెన్ గిల్, అండర్-19 వన్డే వరల్డ్ కప్ విజేతగా నిలిచిన జట్టు కెప్టెన్ ఆయుష్ మాత్రే, అండర్-19 టీ20 ప్రపంచ కప్ చాంపియన్ మహిళల జట్టు సారథి నిక్కీ ప్రసాద్‌లతో నిర్వహించిన చర్చా వేదిక కార్యక్రమానికి హైలైట్ అయ్యింది.




# సినిమా అంటే నాకు ప్రాణం... అందుకే దాన్ని ఎప్పటికీ వదల్లేను: పవన్



"నాకు తెలిసిన, నేను చూసిన హీరో ఒక్కరే.. అది అన్నయ్య చిరంజీవి గారే" అంటూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తన అన్నయ్యే తనకు స్ఫూర్తి అని పునరుద్ఘాటించారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర గ్లింప్స్‌ను చూసి అభినందిస్తూ చిరంజీవి, రామ్ చరణ్ చేసిన ట్వీట్లకు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా జరిగిన చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకలో పవన్ ప్రసంగించారు. "ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్ వేడుకకు వచ్చిన, నా గుండెల్లో స్థానం ఉన్న మీ అందరికీ, టీవీలో ఈ కార్యక్రమాన్ని చూస్తున్న తెలుగు ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకు మీ ఆశీస్సులు అందించడానికి వచ్చినందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస ుకుంటున్నాను.ఇందాక సుమ మాట్లాడుతూ నన్ను గతకాలం నాటి హీరో అన్నట్టు మాట్లాడారు. ఈ మధ్యనే 'ఓజీ' వచ్చిందనే విషయాన్ని మీరు మర్చిపోయినట్టున్నారు. నేను రెగ్యులర్‌గా సినిమాలు చేయకపోవడం వల్ల నన్ను ఇలా వెనక్కి నెట్టడం భావ్యం కాదని బల్లగుద్ది మరీ చెబుతున్నాను. సరదాగా అంటున్నాను కానీ, సినిమా అంటే నాకు ప్రాణం. నాకు అన్నం పెట్టింది సినిమా. ఈ రోజు ప్రజలకు సేవ చేసే గుర్తింపును ఇచ్చింది కూడా సినిమానే. అందుకే సినిమాను వదల్లేను. నా నిర్మాతలు, దర్శకులు, రచయితలు బాగుండాలని కోరుకుంటాను. సినిమా కలెక్షన్ల గురించి నేను ఎప్పుడూ పట్టించుకోలేదు. నేను తెలుగు సినిమా, తమిళ సినిమా అని చూడను, భారతీయ చిత్ర పరిశ్రమగానే భావిస్తాను. నా హీరో అంటే ఒకే ఒక్కరు... మెగాస్టార్ చిరంజీవి గారు. అలాంటి అన్నయ్య, ఈ రోజు 'ఉస్తాద్ భగత్ సింగ్' ట్రైలర్ చూసి ట్వీట్ చేసినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

అలాగే రామ్ చరణ్, 'పెద్ది' దర్శకులు బుచ్చిబాబుకి కూడా ధన్యవాదాలు. ఒక సినిమాను మొదలుపెట్టేటప్పుడు అద్భుతంగా రావాలనే అందరం కోరుకుంటాం. కానీ ఆ తర్వాత ఎన్నో అడ్డంకులు, ఒడిదొడుకులు ఎదురవుతాయి. వాటన్నింటినీ దాటుకుని విజయం సాధించడం చాలా కష్టం. నేను ఒకసారి దర్శకుడిని నమ్మితే, గుడ్డిగా నమ్మేస్తాను. ఏం చేయమంటే అది చేస్తాను. హరీశ్ శంకర్ మొదట ఒక కథ చెప్పారు, కానీ అది ముందుకు వెళ్లలేదు. ఆ తర్వాత కథ మారింది, మధ్యలో కొవిడ్ వచ్చింది, నేను రాజకీయాల్లోకి వెళ్లాను. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక, నా విధులకు ఇబ్బంది కలగకుండా పక్కా ప్రణాళికతో ఈ సినిమా చేశాం. రాత్రింబవళ్లు కూర్చుని కేవలం 40-45 రోజుల్లోనే మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తి చేశాను. నిజంగా పక్కా ప్లానింగ్ ఉంటే, రాజకీయ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సినిమాలు చేయొచ్చని ఈ సినిమా నాకు భరోసా ఇచ్చింది. ఆ ఘనత దర్శకుడు హరీష్ శంకర్‌దే. ఒక నిర్మాణ సంస్థకు వరుసగా విజయాలు రావడం కాకతాళీయం కాదు. మైత్రీ మూవీ మేకర్స్ వారు తీస్తున్న 'పుష్ప', 'జనతా గ్యారేజ్' వంటి చిత్రాల విజయాల వెనుక వారి కృషి ఎంతో ఉంది. అలాంటి సంస్థలో పనిచేసే అవకాశం వచ్చినందుకు వారికి నా ధన్యవాదాలు. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం మీలో ఒకడు దర్శకుడు అయితే ఎలా ఉంటుందో, అలా ఉండే హరీశ్ శంకర్. తెలంగాణ నేల నుంచి వచ్చిన ఈ దర్శకుడికి హద్దుల్లేవు. 'గబ్బర్ సింగ్' సమయంలో నాకు హార్స్ రైడింగ్ రాకపోయినా, గుజరాత్‌లో గుర్రం మీద నన్ను నడిపించాడు. ఒక నటుడి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టడానికి తను పడే తపన అలాంటిది. అనవసరమైన కాంట్రవర్సీలకు వెళ్లొద్దని నేను చెబుతుంటానన్నారు.

# ఏప్రిల్ 17న 'గేదెల రాజు'

గాయకుడు, సంగీత దర్శకుడు రఘు కుంచే టైటిల్ రోల్ ప్లే చేసిన సినిమా 'గేదెల రాజు'. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ఏప్రిల్ 17న విడుదల కాబోతోంది. 'కాకినాడ తాలూకా' అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమా ద్వారా చైతన్య మోటూరి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. వాణి రవికుమార్ మోటూరి ఈ సినిమా నిర్మాత. దర్శకుడు చైతన్య ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే కూడా సమకూర్చారు. కొన్ని నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ఎప్పుడో విడుదల కావాల్సింది. పలుమార్లు వాయిదా పడి ఇప్పుడు రాబోతోంది. రవి ఆనంద్ చిన్ని బిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాశ్, మౌనిక తదితరులు ఈ సినిమాలో ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. కీలక పాత్ర పోషించిన రఘు కుంచే ఈ సినిమాకు సంగీతం అందించారు.







# 'తిమ్మరాజుపల్లి టీవీ' నుంచి 'ఊరు సాంగ్' రిలీజ్



న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా నుంచి 'ఊరు సాంగ్' రిలీజ్ చేశారు. వంశీకాంత్ రేఖన బ్యూటిఫుల్ గా కంపోజ్ చేసిన ఈ పాటకు సనరే సాహిత్యాన్ని అందించారు. మమత రమేష్ పాడారు. 'ఊరు సాంగ్' ఎలా ఉందో చూస్తే -- 'కొమ్మ కొమ్మల్లో కోయిల కూయంగ, తెల్లవారే మా పల్లె పచ్చపచ్చంగ, ఎచ్చని ఎలుగు సీరే కట్టె సక్కంగ, ముగ్గుల పూలు పెట్టి మెరిసే అందంగ, గడపల తోరణాలే గంతులు వేసెనుగా, పువులా పరిమళాలే గాలులు వీచెనుగా, ముస్తాభవుతున్నాదీ శివరాతిరి పండక్కి ఊరు, చిన్నా పెద్దల్లోన మొదలయ్యేను జాతర జోరు..'అంటూ ఆహ్లాదకరమైన పల్లెటూరిలో జరిగే శివరాత్రి జాతర సందడిని, ఆ పండక్కి ఊరు ప్రజలంతా సన్నద్ధమయ్యే తీరును వర్ణిస్తూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. నటీనటులు -- సాయి తేజ్, వేద జలంధర్, ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ, లతీష్ పాల్గొన్నారు

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**